క్లుప్తంగా

నందగిరినగర్‌లో అన్నసంతర్పణ



అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు నందగిరి నగర్‌లోని గోకులకృష్ణ ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం అన్న సంతర్పణ కార్యక్రమం చేపట్టారు. కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ముందుగా ఆలయంలో శ్రీకృష్ణుడికి ఆమె పూజలు చేశారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్



యూత్ ఫర్ సేవా సంస్థ అందించిన స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

సీతంపేట: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ సర్టిఫికెట్(ఎన్ఎంఎంఎస్) పరీక్షకు సిద్ధమవుతున్న మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులకు యూత్ ఫర్ సేవా సంస్థ ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేసింది. 8వ తరగతి చదువుతున్న 20 మందికి శుక్రవారం మెటీరియల్ అందించారు. డిసెంబర్‌లో పరీక్ష జరుగుతుందని, దీనిలో అర్హత సాధిస్తే 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ ఇస్తుందని పాఠశాల హెచ్ఎం శాంతికుమారి తెలిపారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా మళ్లీ రవీంద్రే



సాక్షి, విశాఖపట్నం: భారతీయ జనతా పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షునిగా మేడపాటి రవీంద్ర మరోసారి నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు శుక్రవారం పలు జిల్లాల అధ్యక్షులను మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ జిల్లాకు సంబంధించి ప్రస్తుతం అధ్యక్షునిగా ఉన్న రవీంద్రనే కొనసాగిస్తూ ఆదేశాలిచ్చారు. కాగా రవీంద్ర 2019 డిసెంబర్ 31న మొదటిసారి జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు మరోసారి ఆయనకు అవకాశం ఇవ్వడం పట్ల పార్టీ శ్రేణులు అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యే గంటా పర్యటన

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు తిక్కవానిపాలెంలో రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత ఆధ్వర్యంలో శుక్రవారం బాబు షూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గీతం ఆస్పత్రి నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం పలు ఇళ్లకు ఆయన వెళ్లి ప్రజా వేదిక కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఇన్‌చార్జి విజయ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరింత సుందరంగా కూడళ్లు



రైల్వే న్యూకాలనీ వీఐపీ రోడ్ జంక్షన్ వద్ద నిర్మిస్తున్న వాటర్ ఫౌంటైన్



రైల్వే న్యూకాలనీ - దొండపర్తి రోడ్డులో నిర్మిస్తున్న టేబుల్ టాప్ స్పీడ్ బ్రేకర్లు

- స్మార్ట్ సిటీ నిధులతో రైల్వే న్యూకాలనీ జంక్షన్ అభివృద్ధి
- వాటర్ ఫౌంటైన్, టేబుల్ టాప్ స్పీడ్ బ్రేకర్ల నిర్మాణం

తాటిచెట్లపాలెం: నగరంలోని పలు ప్రాంతాలను, వాటిలోని జంక్షన్లను స్మార్ట్ సిటీ నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. దీంతో నగరం మరింత సుందరంగా మారనుంది. ముఖ్యంగా జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ జంక్షన్‌ను స్మార్ట్ సిటీ నిధులతో అందంగా తయారు చేస్తున్నారు. వీఐపీ రోడ్ రైల్వే న్యూకాలనీ జంక్షన్ వద్ద వాటర్ ఫౌంటైన్‌ను నిర్మిస్తున్నారు. దీనికి మరింత అదనపు ఆకర్షణగా ఫోకస్ లైటింగ్, అందమైన, ఆహ్లాదకరమైన పచ్చని మొక్కలతో ఈ కూడలిని అభివృద్ధి చేస్తున్నారు. ఈ ఫౌంటైన్ చుట్టూ ప్రత్యేక కబిల్ స్టోన్ ఫ్లోరింగ్ చేయనున్నారు. మధ్యలో ప్రత్యేక ఆకర్షణగా ప్రత్యేకంగా రైలు బొమ్మను కూడా ఏర్పాటుచేస్తున్నట్లు తెలిసింది.

అత్యాధునిక స్పీడ్ బ్రేకర్లు..

రైల్వే న్యూకాలనీ జంక్షన్‌లో అత్యాధునికంగా టేబుల్ టాప్ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రమాదాల నియంత్రణకు, వాహనాల సున్నిత ప్రయాణాలకు ఇవి ఎంతగానో సహాయపడతాయని జీవీఎంసీ సిబ్బంది తెలిపారు. ఈ స్పీడ్ బ్రేకర్లను కొన్ని ప్రత్యేకమైన పరిమాణం, కచ్చితమైన కొలతలతో నిర్మిస్తున్నారు. శరవేగంగా ఈ పనులు కొనసాగుతున్నాయి. మరో నెలలో పూర్తి కావచ్చని తెలిసింది. ఇవి పూర్తయితే రైల్వేన్యూకాలనీ వీఐపీ రోడ్ జంక్షన్ మరింత సుందరంగా, ప్రత్యేక ఆకర్షణగా, ఒక లాండ్ మార్క్‌గా నిలవనుంది. జంక్షన్ల అభివృద్ధి పనులపై స్థానికులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేశారు.

నేత్రదానం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

సీతంపేట: ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో గత నెల 25 నుంచి జరుగుతున్న 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ముఖ్య అతిథులుగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మరణించిన తర్వాత నేత్ర దానం వల్ల చిరంజీవులుగా ఉంటామని తెలిపారు. నేత్రదానం పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి 15 రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహించిన జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ పి.విశ్వామిత్రను అభినందించారు. డాక్టర్ విశ్వామిత్ర మాట్లాడుతూ ఆగష్టు 25 నుంచి సెప్టెంబరు 8 వరకు జిల్లాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈసందర్భంగా నేత్ర ఆవశ్యకతపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన పోస్టు గ్రాడ్యుయేట్స్, ఆప్టోమెట్రీ విద్యార్థులకు, జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోహిసిన్ ఐ బ్యాంకు ప్రతినిధులు, యంగ్ ఇండియా ప్రతినిధులు డాక్టర్ తృప్తి, డాక్టర్ రాయ్, రోటరీ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ బెన్ విక్టర్, డాక్టర్ బెట్సీ విలియమ్స్, ఎల్వీ హాస్పిటల్, శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు, నేత్రవైద్య శాల వైద్యులు, ప్రొఫెసర్లు, నర్సింగ్ స్టాఫ్, పోస్టు గ్రాడ్యుయేట్స్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాస రచనలో విద్యార్థుల ప్రతిభ



విజయకుమార్, షహీదా, హైమావతిలను అభినందిస్తున్న హెచ్ఎం లక్ష్మీ నరస, విశ్వనాథం

సీతంపేట: జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో నిర్వహించిన వ్యాస రచన పోటీలో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి మొదటి మూడు బహుమతులు గెలుపొందారు. ఎం.విజయకుమార్, ఎం.డి.షహీదా పర్వీన్, కె.హైమావతి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర చేతుల మీదుగా సర్టిఫికెట్లు, బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వీరిని పాఠశాలలో హెచ్ఎం లక్ష్మీ నరస, తెలుగు ఉపాధ్యాయుడు ఎం.ఎస్.వి.విశ్వనాథం అభినందించారు.

ప్రజా సహకారంతోనే దోమల నిర్మూలన



మాట్లాడుతున్న కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ

సీతంపేట: మలేరియా, డెంగ్యూ జ్వరాలను వ్యాప్తి చేసే దోమల నిర్మూలనకు వైద్య ఆరోగ్య సిబ్బందికి ప్రజలంతా సహకరించాలని 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ కోరారు. వెంకటేశ్వర కాలనీ సచివాలయంలో ఫ్రైడే-డ్రైడే, మహిళల ఆరోగ్యంపై శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, గోళాలు, కుండీలు, ట్యాంకులు, డ్రమ్ములు వారానికి ఒకసారి శుభ్రం చేసి తిరిగి నీరు పట్టుకోవాలని సూచించారు. జ్వరం వస్తే సమీప పట్టణ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, ఆకుకూరలు, పప్పు దినుసులు, పాలు, గుడ్లు ఆహారంలో ఉండేలా చూడాలని కార్పొరేటర్ సూచించారు. కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజన్ మకుడి-సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్ల మధ్య జరుగుతున్న మూడో లైన్ సంబంధిత ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. ప్రయాణికుల మార్పులను గమనించి సహకరించాలని రైల్వే అధికారుల తెలిపారు. ఈ నెల 20 నుంచి 25 వరకు విశాఖలో బయల్దేరే విశాఖ-న్యూఢిల్లీ(20805) ఏపీ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా విజయనగరం, టిట్లాఘడ్, రాయపూర్, గొండియా, నాగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 20నుంచి 25వ తేదీ వరకు న్యూఢిల్లీలో బయల్దేరే న్యూఢిల్లీ- విశాఖ (20806)ఏపీ ఎక్స్‌ప్రెస్ వయా నాగ్‌పూర్, గొండియా, రాయ్‌పూర్, టిట్లాఘడ్, విజయనగరం మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 14, 21వ తేదీల్లో బయల్దేరే విశాఖ-గాంధీదాం (20803) వీక్లీ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా విజయనగరం, టిట్లాఘడ్, రాయపూర్, గొండియా, నాగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 24న గాంధీదాంలో బయల్దేరే గాంధీదాం-విశాఖ (20804) వీక్లీ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా నాగ్‌పూర్, గొండియా, రాయ్‌పూర్, టిట్లాఘడ్, విజయనగరం మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 22,25వ తేదీల్లో విశాఖలో బయల్దేరే విశాఖ-హజరత్ నిజాముద్దీన్ (12803)స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా విజయనగరం, టిట్లాఘడ్, రాయపూర్, గొండియా, నాగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 20,24వ తేదీల్లో హజరత్ నిజాముద్దీన్‌లో బయల్దేరే హజరత్ నిజాముద్దీన్- విశాఖ (12804)స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ వయా నాగ్‌పూర్, గొండియా, రాయ్‌పూర్, టిట్లాఘడ్, విజయనగరం మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 24న పూరిలో బయల్దేరే పూరి-ఓఖా (20819) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వయా విజయనగరం, టిట్లాఘడ్, రాయ్‌పూర్, నాగ్‌పూర్, వార్ధా మీదుగా ప్రయాణిస్తుంది.

నేడు వెలమ ప్రతిభా పురస్కారాల ప్రదానం

మురళీనగర్: మురళీనగర్-మాధవదార వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వెలమ సామాజిక వర్గ విద్యార్థులకు శనివారం ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తామని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాశల సూర్యనారాయణ, వెన్నెల సూర్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 2023లో పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక ప్రతిభా పురస్కారాలు అందిస్తామన్నారు. శనివారం సాయంత్రం 6 గంటలకు మురళీనగర్‌లోని ఆహ్వానం ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

డబ్బుతో పరారైన కేసులో దర్యాప్తు ముమ్మరం

సీతమ్మధార: విదేశాల్లో(స్వీడన్) ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ అమృత్ ఎంటర్‌ప్రైజస్ వారు నిరుద్యోగుల వద్ద నుంచి సుమారు కోటి రూపాయలు వసూలు చేసి పరారైన సంఘటన కేసు దర్యాప్తును ఫోర్త్‌టౌన్ పోలీసులు ముమ్మరం చేశారు. దొండపర్తిలోని టీఎస్ఎన్ కాలనీలో అమృత్ ఎంటర్‌ప్రైజస్ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ సోషల్ మీడియాలో ప్రకటించి మోసం చేసి బోర్డు తిప్పేసి పరారైన విషయం తెలిసిందే. దీంతో బాధితులు ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, విజయవాడ, కడప, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి సుమారు 70 మంది ఆన్‌లైన్‌లో సుమారు కోటి రూపాయలు చెల్లించారు.

రుక్మిణీ శ్రీకృష్ణుల ఊరేగింపు



ఊరేగింపులో రుక్మిణీ సహిత శ్రీకృష్ణుడు

సీతంపేట: స్థానిక పార్వతీశ్వరాలయంలో జరుగుతున్న శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం రుక్మిణీ సహిత శ్రీకృష్ణుడి పంచలోహ ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పూల దండలతో అలంకరించి మేళతాళాలతో ఈ కార్యక్రమం జరిపారు. బాల మురుగన్ సేవా సమితి ఆధ్వర్యంలో గొలుగూరి గంగిరెడ్డి, అనిత దంపతులు నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు గంగవరపు శివాజీశర్మ, భాస్కరశర్మ పర్యవేక్షించారు.

జాబ్ మేళాలో 80 మందికి ఉద్యోగాలు



సూచనలిస్తున్న అధికారులు

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి (క్లరికల్) తెలిపారు. ఆర్కే హాస్పిటల్, క్వీన్స్ ఎన్నారై, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, ఎంజీఎం క్యాన్సర్ హాస్పిటల్, అపోలో ఫార్మసీ, హీరో మోటో కార్ప్, హెటిరో డ్రగ్స్, ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, టీసీఎల్-సీఎల్‌వోటీ, ఇండస్, కేర్ హాస్పిటల్, సెవెన్ హిల్స్ హెల్త్ కేర్ మొదలగు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 551 ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూలకు 221 మంది అభ్యర్థులు హాజరయ్యారని సంస్థల ప్రతినిధులు చెప్పారు. వారిలో 80 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి సుబ్బిరెడ్డి చేతుల మీదుగా ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడంతో వాటిలో నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

కొండవాలులో విద్యుత్ వెలుగులు



జేఎల్ నెహ్రూ నగర్‌లో విద్యుత్ లైటు ఏర్పాటును పరిశీలిస్తున్న నాయకులు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతాల్లో కార్పొరేటర్ గంకల కవిత వినతుల మేరకు శుక్రవారం నూతన విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. వీధి దీపాల సమస్యపై వార్డు ప్రజలు చేసిన ఫిర్యాదుల మేరకు కార్పొరేటర్ కవిత కృషితో జీవీఎంసీ విద్యుత్ విభాగ అధికారులు ఈఈ శ్రీనివాస్, ఏఈ సాయినాథ్ పర్యవేక్షణలో ఇందిరా నగర్, జవహర్‌లాల్ నెహ్రూ నగర్, బాపూజీనగర్, ప్రాంతాల్లో 20 స్తంభాలకు కొత్త లైట్లు అమర్చినట్లు బీజేపీ వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు తెలిపారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వర్షాభావ పరిస్థితుల్లోనూ నిరంతర విద్యుత్



సమావేశంలో పాల్గొన్న ఏపీఈపీడీసీఎల్ అధికారులు

దొండపర్తి: వర్షాభావ పరిస్థితుల కారణంగా విద్యుత్ డిమాండ్ పెరిగినప్పటికీ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసినట్లు ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్ తెలిపారు. శుక్రవారం సర్కిల్ ఆఫీస్ సమావేశ మందిరంలో హెచ్‌టీ విద్యుత్ వినియోగదారుల సమావేశం నిర్వహించారు. ఉమ్మడి విశాఖలో అన్ని ప్రాంతాల నుంచి సుమారు 100 మందికి పైగా వినియోగదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల కారణంగా అత్యధికంగా 1616 మెగావాట్ల విద్యుత్ వినియోగం రికార్డు అయినట్లు వివరించారు. విద్యుత్ లోటును సర్దుబాటు చేసేందుకు పరిశ్రమల విద్యుత్ వినియోగదారులకు ఇచ్చిన నోటీసులు ఉపసంహరించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో విద్యుత్ సరఫరా పరిస్థితి మెరుగుపడడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అచ్యుతాపురం ఎస్ఈజెడ్ నుంచి కొంత మంది హెచ్‌టీ వినియోగదారులు విద్యుత్ అంతరాయాలపై సందేహాలు వ్యక్తపరచగా వాటిని అధికారులు నివృత్తి చేశారు.

సీపీ త్రివిక్రమ్ వర్మకు ఉత్కృష్ట సేవా పతకం

మరికొంతమందికి కూడా..

దొండపర్తి: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ ప్రతిష్టాత్మక ఉత్కృష్ట సేవా పతకం లభించింది. ఆయనతో పాటు జిల్లాలో ముగ్గురు సీఐలను, ఒక ఏఎస్ఐతో పాటు 14 మంది హెచ్‌సీలు, 14 మంది కానిస్టేబుళ్లను ఈ పతకానికి ప్రభుత్వం ఎంపిక చేసింది. అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఒక ఎస్ఐతో పాటు 16 మంది హెచ్‌సీలు ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపికైన వారు..

దువ్వాడ సీఐలు బి.శ్రీనివాసరావు, ఎ.వెంకటలీలారావు, ద్వారకా సబ్‌డివిజన్ క్రైం టి.ఇమాన్యుయల్ రాజు, కంచరపాలెం ఏఎస్ఐ కె.కనకరాజు ఉత్కృష్ట సేవా పతకాన్ని అందుకోనున్నారు. అలాగే హెడ్‌కానిస్టేబుళ్లు ఎం.జీవన్‌కుమార్(సీఏఆర్), జి.వి.రమణ(గోపాలపట్నం ట్రాఫిక్), ఎం.బాలరాజు(పీఎంపాలెం క్రైం), టి.వసంతరావు(సీఎస్‌బీ), జె.ఎం.ఎం.రెడ్డి(పద్మనాభం), జి.శ్రీనివాసరావు(త్రీటౌన్), ఎస్.శ్రీనివాసరావు(దువ్వాడ), డి.సురేష్‌కుమార్(దువ్వాడ క్రైం), ఎ.రమేష్‌కుమార్(దువ్వాడ ట్రాఫిక్), పి.జయసీలన్ (ఎయిర్‌పోర్ట్ ట్రాఫిక్), జి.శ్రీహరి(మల్కాపురం), కె.ప్రసాద్(మల్కాపురం), టి.కామేశ్వరరావు(ఆనందపురం క్రైం)తోపాటు ఏసీబీ హెచ్‌సీ టి.కొండలరావు ఈ సేవా పతకానికి ఎంపికయ్యారు. అదే విధంగా కానిస్టేబుళ్లు జి.ప్రసాద్(ఏఆర్), కె.ఎస్.స్వామి(ఏఆర్), జి.శ్రీనివాసరావు(ఏఆర్), వి.దశరావు(ఏఆర్), ఎం.గోవిందరావు(ఏఆర్), పి.సన్యాసిరావు(ఏఆర్), ఎస్.బి.వెంకటేశ్వర్లు(వన్‌టౌన్ క్రైం), ఇ.మునిరాజు(ఏఆర్), ఎస్.ఎరిబాబు (ఏఆర్), బి.శ్రీధర్(ఏఆర్), ఎం.వీరబాబు(ఏఆర్), కె.చిన్నయ్య(ఏఆర్), ఎం.ప్రసాదరావు(ఏఆర్), పి.చిన్న బొజ్జయ్య ఎంపికయ్యారు.

అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికైన వారు..

న్యూపోర్ట్ ట్రాఫిక్ ఎస్ఐ పి.రాజు, హెచ్‌సీలు కె.వైకుంటరావు (ఏఆర్), ఆర్.మాధవరావు(ఏఆర్), టి.రాము (ఆనందపురం ట్రాఫిక్), జె.వెంకటరవి(ఏఆర్), పి.వరహాలు(దువ్వాడ), ఎ.రమణారావు(సీసీఎస్), జి.శ్రీనివాసరావు(టూ టౌన్ ట్రాఫిక్), కె.బాబా అమర్ శేఖర్ (సీఎస్‌బీ), కె.ఈశ్వరరావు(గాజువాక క్రైం), వి.కనకరావు(ఏఆర్), ఎస్.కె.సుభాన్(సీఎస్‌బీ), జి.రామారావు(ఏఆర్), బి.ఎస్.మూర్తి(ఎంపీపీ)తో పాటు 16వ బెటాలియన్ హెచ్‌సీలు బి.రామానుజులు, పి.కోటేశ్వరరావు, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌లో హెచ్‌సీ ఎం.సన్యాసిరావు ఈ పతకానికి ఎంపికయ్యారు.

ఏఎస్ఐ కనకరాజుకు అభినందన



ఏఎస్ఐ కనకరాజును అభినందిస్తున్న కంచరపాలెం సీఐ సాయి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కనకరాజు ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయనను సీఐ ఎస్.సాయి, ఎస్ఐలు, ఏఎస్ఐలు, సిబ్బంది అభినందించారు. కనకరాజు అందించిన ఉత్తమ సేవలకు గానూ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆయన పేరును సిఫార్సు చేశారని సిబ్బంది తెలిపారు.

అక్టోబర్‌లో ఏఎంసీ శతాబ్ది ఉత్సవాలు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కళాశాల (ఏఎంసీ) శతాబ్ది ఉత్సవాలను ఈ ఏడాది అక్టోబర్ 27,28,29 తేదీల్లో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. 27న ఆంధ్రా మెడికల్ కళాశాల (ఏఎంసీ) దినోత్సవం, 28న సెంటినరీ బ్లాక్ నిర్మాణానికి ప్రారంభోత్సవం, 29న అకడమిక్ సెషన్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. కాగా ఏఎంసీలో వైద్య విద్య అభ్యసించి దేశ, విదేశాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు సెంటినరీ బ్లాక్ నిర్మాణానికి విరాళాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఈ బ్లాక్ ప్రారంభోత్సవానికి పలువురు ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్టు బ్లాక్ నిర్మాణ కమిటీ చైర్మన్ డాక్టర్ జి.రవిరాజ్ తెలిపారు.

ప్రసాద్ పథకంతో సింహగిరికి మహర్దశ

రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన రూ.55కోట్ల ప్రసాద్ పథకం నిధులతో సింహగిరికి మహర్దశ పడుతుందని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. ప్రసాద్ పథకం పనులకు సంబంధించి రూపొందించిన డీపీఆర్‌ను ఆయన శుక్రవారం సింహాచలం దేవస్థానంతో అధికారులతో కలిసి పరిశీలించారు. దేవదాయశాఖ, దేవస్థానం, టూరిజంశాఖ అధికారులతో పనులు జరిగే ప్రాంతాల్లో ఫీల్డ్ విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు పూర్తి స్థాయిలో వినియోగపడేలా అభివృద్ధి పనులు జరగాలని, అంతేకాని ఏ పనీ వృథాగా పోకూడదని సూచించారు. ఆలయ ఉత్తర ప్రాంగణంలో ఉన్న ప్రదేశంలో ఈశాన్యం మూలన యాగశాలను నిర్మించే విషయంపై వైదికుల సూచనలను పరిగణలోకి తీసుకున్నామన్నారు. అలాగే ఆలయ ఉత్తరద్వారం ఎదురుగా ఉన్న సువిశాల ప్రదేశంలో క్యూకాంప్లెక్స్ నిర్మాణంపై చేయాలా...వద్దా అన్న విషయంపై పరిశీలన జరిపారు. మాస్టర్‌ప్లాన్‌కు ఎలాంటి విఘాతం కలగకుండా పనులు జరుగుతాయని స్పష్టం చేశారు. కొండదిగువ పురాతన పుష్కరిణి సత్రాన్ని తొలగించి ఆ స్థానంలో జీప్లస్-ఫైవ్ కింద ఆధునిక సదుపాయాలతో సత్రాలను నిర్మిస్తామన్నారు. పుష్కరిణి సత్రం మధ్యలో ప్రస్తుతం ఉన్న పురాతన మండపాన్ని అలేగే ఉంచుతామని తెలిపారు. 1936లో నిర్మించిన ఆగమ పాఠశాలను కూడా వేరే ప్రాంతంలో నిర్మిస్తామన్నారు.అప్పటి వరకు ప్రస్తుతం ఉన్న భవనాన్ని ఆధునీకీకరిస్తామన్నారు. ఈ సందర్భంగా వేద విద్యార్థులతో కొంతసేపు మాట్లాడారు. దేవస్థానం ఈవో కార్యాలయ భవనం కూడా పక్కాగా నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. పాత అడవివరం వైపు నుంచి వచ్చే మార్గంలో ఉన్న రెండో టోల్‌గేట్ వద్ద సువిశాలమైన పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సింహగిరిపై ఉన్న మ్యూజియాన్ని కమిషనర్ సందర్శించారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను ఈవో త్రినాథరావు ఆయనకు అందజేశారు. టూరిజం శాఖ సీఈ సీఎస్ఎన్ మూర్తి, ఈఈ రమేష్, జేఈలు మదన్‌మోహన్, సీతారామ్, దేవదాయశాఖ సీఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా నిలిచిన లారీ

అరగంట పాటు ట్రాఫిక్ జామ్



బుల్లయ్య కళాశాల వద్ద రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన లారీ.. ట్రాఫిక్ జామ్

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల వద్ద శుక్రవారం రోడ్డుకు అడ్డంగా ఓ లారీ మరమ్మతుకు గురై ఆగిపోయింది. సుమారు అరగంట పాటు ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో ఇతర వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. వాహన చోదకులు, విద్యార్థులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. సత్యం జంక్షన్ వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. రామాటాకీస్ నుంచి వచ్చిన వాహనాలు బారులు తీరాయి. భారీ వాహనం కావడం.. రోడ్డుకు ఇరువైపులా సగ భాగం ఆక్రమించి ఉండటంతో ట్రాఫిక్‌లో చిక్కుకున్న ప్రయాణికులు విసిగిపోయారు. అదే సమయంలో బుల్లయ్య కళాశాల విడిచిపెట్టడంతో విద్యార్థులతోపాటు వాహన చోదకులకు ఇబ్బందులు తప్పలేదు.

10న ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

మద్దిలపాలెం: రాష్ట్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు స్వీకరించిన వారిని ఈనెల 10వ తేదీన బాల వికాస్ ఫౌండేషన్ సంస్థ, గాంధీ సెంటర్ సంయుక్తంగా సత్కరిస్తాయని ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. డాక్టర్ బుల్లయ్య కళాశాల ప్రాంగణంలో గల గాంధీ సెంటర్ సెమినార్ హాల్లో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్ర ఉత్తమ అవార్డు పొందిన ఉమా గాంధీ, కె.వి.ఎస్.సుబ్రహ్మణేశ్వరరావు, కె.రాంబాబు, సురేష్‌కుమార్‌లను ఈ సందర్భంగా సత్కరిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి వి.బాలమోహన్ దాస్ హాజరు కానున్నారని తెలిపారు.